క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



కిడ్నీ బాధిత కుటుబానికి రూ. 2 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం గ్రామానికి చెందిన పోతల అప్పలస్వామి కుటుంబానికి సీఎం సహాయనిధి ఆదుకుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. కిడ్నీ వ్యాధితో అప్పలస్వామి మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రెండు లక్షల రూపాయలు మంజూరైంది. దీంతో మృతుడి భార్య సుజాతకు మండవ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలోని వందలాది మంది అభాగ్యులకు సుమారు కోటి రూపాయల సాయం చేసినట్లు చెప్పారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



మాట్లాడుతున్న హెచ్ఎం సుబ్బారావు

సీతంపేట: వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్ఎం కె.సుబ్బారావు తెలిపారు. పాఠశాల ఆవరణలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన సాగిస్తున్నట్లు చెప్పారు.

అభినందనలు



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఈఓ ఆనందరావు, తదితరులు

సీతంపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో దోనుబాయి పాఠశాల విద్యార్థులకు మొదటి స్థానం లభించింది. దీంతో చిన్నారులను ఎంఈఓ ఎం.ఆనందరావు, స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్ఎం టి.చంద్రారావు, తదితరులు శనివారం ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కొనసాగుతున్న సమ్మె



నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాలకొండ: అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె నాలుగో రోజైన శనివారం కూడా కొనసాగింది. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. తెలంగాణా కంటే ఆంధ్రాలో ఎక్కువ వేతనాలు అందించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆ యూనియన్ నాయకులు బి. అమరవేణి, ఎస్. హిమప్రభ స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకుమారి తెలిపారు. మండలంలోని కుశిమి గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ధాన్యం ఎంతకు కనుగోలు చేస్తున్నదీ, అందరికీ తెలిసేలా ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏఓ హరికృష్ణ, ఎంఏఓ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ రేషన్ అందేలా చర్యలు

భామిని: కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు అందేలా ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు సహకరించాలని తహసీల్దార్ అప్పారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఎండీయూ వాహనాలను ఆయా సచివాలయాల ముందు నిలిపి మిగిలిపోయిన కార్డుదారులకు సరుకులు అందించాలని సూచించారు. ఒక్కో వాహనం రెండు సచివాలయాల పరిధిలోకి వస్తే.. ఉదయం ఒక సచివాలయం వద్ద, మధ్యాహ్నం రెండో సచివాలయం వద్ద నిలిపి ఉంచి సరుకులు అందివ్వాలన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం..

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని సంత నర్సిపురంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన సంక్షేమ పథకాలను వివరించారు. ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ వీధిలో రోడ్లు వేయాలని.. ఎస్సీ వీధిలో పాడైన కాలువలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరగా.. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కళావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యవతి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం..

అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే విశ్వారాయి కళావతి అన్నారు. సంతనర్సిపురంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన గుడ్ల శంకరరావు కుటుంబాన్ని ఆమె పరామర్శించి.. వంటసామగ్రి, బియ్యం, దుప్పట్లు అందజేశారు. రావాల్సిన నష్టపరిహారాన్ని తొందరగా అందజేయాలని అధికారులకు సూచించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి



అగ్నిప్రమాద బాధితులకు బియ్యం, వంట సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

రైతులకు అండగా నిలవాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు

పాలకొండ రూరల్: గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ, వ్యవసాయాధికారులు సమన్వయంతో అన్నదాతలకు అండగా నిలవాలని మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ అధ్యక్షతన శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం అమ్మకాలకు సంబంధించి అధికారులు రైతుల పక్షాన నిలవాలని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్ కోరా రు. అలాగే ఆర్‌బీకే సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మద్దతు ధర, ధాన్యం గ్రేడింగ్, తూకం, రవాణా, ఇతర నిబంధనలు అమలు విషయంలో సహకరించాలని కోరారు. ముఖ్యంగా మిల్లర్ల విషయంలో ఉదాసీనత లేకుండా, అధికారులు నిబంధనలు అమలు చేయగలిగితే ప్రభుత్వానికి పేరు వస్తుంద ని అభిప్రాయపడ్డారు. ఏఓ వై.వాహిని మాట్లాడు తూ, బ్యాంక్ గ్యారెంటీలు పొందిన స్థానిక మిల్లర్లకు కొనుగోళ్లపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నా రు. తుపాను నేపథ్యంలో రంగుమారిన ధాన్యం కూడా ఆర్‌బీకేల ద్వారా సేకరించేలా చర్యలు చేపట్టినట్లు రెండో వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్ తెలిపారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో జీజీఎంపీ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీఓ డొంక త్రినాథులు వివరించారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు వేగంగా చేపడుతున్న ట్లు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలో నూతన రక్షిత మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణ పురోగతిని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవలిక సభ దృష్టి కి తీసుకు వచ్చారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ మాధవరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి.మేరి, దశారత్నం, ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి, పశుసంవర్ధక శాఖాధికారి సిద్దార్ధ, ఆర్‌అండ్‌బీ జేఈ జగన్‌మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుపై వివరణ ఇస్తున్న ఏఓ వాహిని

జాతీయస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థులు

సీతంపేట: జాతీయ స్థాయి క్రీడా పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో జావెలిన్ త్రో పోటీలో బి.దినేష్ గోల్డ్ మెడల్ సాధించాడు. ట్రిపుల్ జంప్ విభాగంలో ఊయక భద్ర సిల్వర్ మెడల్ పొందాడు. వీరితో పాటు మరికొందరు రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 24న మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్న విద్యార్థులను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అవసరమయ్యే సహకారం అందిస్తామన్నారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమశాఖ డీడీ మంగవేణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, పీడీ లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న పీఓ కల్పనాకుమారి

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

కొమరాడ: మండలంలోని గంగురేగువలస ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ శనివారం తనిఖీ చేశారు. మిల్లుల వద్దకు ధాన్యంతో వచ్చిన లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంధానమైన వాహనాలకు జీపీఎస్ కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రం సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం, ధాన్యం సంచులు, రవాణా ఖర్చులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు వచ్చిన ధాన్యాన్ని తక్షణమే అనుసంధానించిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కస్టోడియన్ అధికారులు విధిగా ఉండాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు.



ధాన్యంను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

పర్యవేక్షణ తప్పనిసరి

పాలకొండ: పిల్లల చదువుపై తల్లితండ్రులు పర్యవేక్షణ చేయాలని ఓని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బి. నాగమణి అన్నారు. పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిర్మాణాత్మక మూల్యాంకణాల అనంతరం విద్యార్థుల ప్రతిభ తల్లిదండ్రులకు తెలియజేశామన్నారు. సంగ్రహణాత్మక మూల్యాంకన ఫలితాలను నివేదించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తగిన సూచనలు ఉపాధ్యాయులకు అందించాలని తల్లిదండ్రులను కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాలవలస శారదాకుమారి, గొగుల సూర్యనారాయణ, దానేటి పుష్పలత, కుదమ తిరుమలరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం నాగమణి

క్రీడా మైదానానికి స్థల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం పాఠశాలలో గతంలో మంజూరైన క్రీడా మైదానంను శాప్ అసిస్టెంట్ ఇంజినీర్ పి.రాధాకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌తో పాటు మరికొన్ని క్రీడా మైదానాలకు జిల్లా క్రీడా అధికారుల నుంచి ప్రతిపాదనలు అందాయని, మైదానాల ఏర్పాటుకు అవసరమైన స్థల పరిశీలన కోసం ప్రస్తుతం వచ్చినట్లు చెప్పారు. మంజూరైన పనులను కొద్దిరోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘ అధ్యక్షుడు అరిక చంద్రశేఖర్, మండల సర్వేయర్లు జి.హనుమంతరావు, గ్రామ సర్వేయర్లు బాబ్జీ, ప్రశాంత్, వీఆర్వో జి.చిరంజీవి, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావు, మాధవరావు, కొండలరావు ఉన్నారు.



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న శాప్ అధికారి రాధాకృష్ణ

పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

గుమ్మలక్ష్మీపురం: విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కిల్లక సత్యనారాయణ భౌతికాయానికి శనివారం ఆయన స్వగ్రామమైన గుమ్మలక్ష్మీపురం మండలం కొగొట్టులో పోలీసు లాంఛనాల మధ్య కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పాలకొండ డీఎస్పీ కృష్ణారావు సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన ఖర్చుల నిమిత్తం రూ.25వేలను మృతుని అందజేశారు. పోలీస్‌శాఖ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం సకాలంలో వచ్చేలా కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పాలకొండ సీఐ సత్యానారాయణ, ఎస్ఐ ఎన్.ప్రశాంత్, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ ఉన్నారు.



పోలీసు లాంఛనాలతో సత్యనారాయణకు దహన సంస్కారాలు చేస్తున్న దృశ్యం

విక్రంపురంలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామ సచివాలయం ఆవరణలో సర్పంచ్ కళింగి శైలజ ఆధ్వర్యంలో శనివారం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు కళింగ మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సిరిపురం రామకృష్ణ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న అధికారులు, గ్రామ పెద్దలు

మళ్లీ జగనన్నే సీఎం



కుదమలో వైఎస్సార్‌సీపీ నాయకుల ర్యాలీ

జియ్యమ్మవలస: కుదమ గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు ఆధ్వర్యంలో శనివారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా కావాలని, అందుకు ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డాష్‌బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సచివాలయ మండల కన్వీనర్ పల్ల అనంతనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, శిఖబడి సర్పంచ్ కోట రమేష్, నాయకులు మరడాన జగన్నాథంనాయుడు, బాబూ భువనమోహనరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బి.చంద్రశేఖర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను ఎంఈఓ పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ ప్రదర్శనలో కేజీబీవీకి చెందిన సామల మనస్విని ప్రాజెక్టు ప్రథమ స్థానం, టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎం.కెలేంద్ర ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. గ్రూప్ విభాగంలో మొదటి స్థానాన్ని గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.త్రివేణి బృందం, ద్వితీయ స్థానాన్ని కేజీబీవీకి చెందిన ఎల్.హారిక బృందం సొంతం చేసుకున్నారు. టీచర్స్ ప్రాజెక్ట్‌లో గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ ఉపాధ్యాయురాలు ఎం.రజిని ప్రథమ స్థానంలో నిలిచారు. వీరంతా జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బిడ్డిక భీముడు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

పాలకొండ: మండలంలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సింగన్నవలస, అంపిలి, వెలగవాడ, తంపటాపల్లి గ్రామాల పరిధిలో సేకరించిన ధాన్యాన్ని రెండు రోజులుగా మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లర్లతో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నాగూరు విద్యార్థులు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఐ.రాజేశ్వరరావు తెలిపారు. అండర్-17 లాంగ్‌జంప్‌లో దత్తి సాయి కుమార్, త్రో బాల్‌లో దత్తి నిత్యశ్రీ, సీహెచ్.గిరిప్రసాద్, నెట్‌బాల్‌లో ఎం.సౌందర్య, ఎ.అశోక్ కుమార్, అండర్-14 విభాగంలో ఎస్ఎస్.భానుశ్రీ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులకు స్థానిక సర్పంచ్ కె.శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు.

రక్షణగోడకు మరమ్మతులు

గరుగుబిల్లి: తోటపల్లి పాత రెగ్యులేటర్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న రక్షణగోడకు జట్టు ట్రస్టీ డి.పారినాయుడు ఆధ్వర్యంలో శనివారం మరమ్మతులు చేపట్టారు. రక్షణగోడను బాగుచేయాలని పలుమార్లు అధికారులను కోరినప్పటికీ పనులు చేపట్టకపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రమీల పనులను పర్యవేక్షించారు.

టాపర్స్‌కు బహుమతులు

భామిని: సమ్మేటివ్ -1 పరీక్షలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు హెచ్ఎం శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సరిసాబద్ర బాలయ్య శనివారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నేరడి - బి ఎంపీయూపీ పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగాన్ని బలోపేతం చేశారన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

పోలింగ్ బూత్‌ల పరిశీలన

భామిని: మండలంలోని పోలింగ్ బూత్‌లను సెక్టోరియల్ అధికారులు, పోలీస్ సిబ్బంది శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని 44 పోలింగ్ బూత్‌లలో ఉన్న సౌకర్యాలు, విద్యుత్, వసతిపై ఆరా తీశారు. భామిని నుంచి విడిపోయిన బొడ్డగూడ బూత్, కోసలి నుంచి విడిపోయిన కీసర బూత్‌లకు అవసరమైన భవనాలు గుర్తించారు. పరిశీలనలో ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, ఏఈఈలు గౌరీశంకర్, ఎ.సందీప్, సీడీపీఓ శాంతిభవానీ, ఎస్ఓ జ్యోతిలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు.



నులకజోడులో స్కూల్ భవనం పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఏపీజీఈఎఫ్ మన్యం జిల్లా కన్వీనర్‌గా సితన్న

గుమ్మలక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా కన్వీనర్‌గా గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు మాల్లా సీతన్న నియమితులయ్యా రు. ఏపీజీఈఎఫ్ స్టేట్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి, జనరల్ సెక్రటరీ అరవపాల్ నుంచి నియామక ఉత్తర్వులు అందినట్లు శనివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో చెప్పారు. వైఎస్సార్ టీచర్స్ అసోషియేషన్ మన్యం జిల్లా అధ్యక్షునిగా ఉన్న తనపై నమ్మకంతో ఏపీజీఈఎఫ్‌కు జిల్లా కన్వీనర్‌గా ఎంపిక చేసిన ఫెడరేషన్ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని అన్నారు.



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

గరుగుబిల్లి: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ ఎస్.నాగభూషణరావుకు శనివారం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈనెల 20లోగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు బి.రామకృష్ణ, ఆర్.రాంబాబు, వై.యశోద, ఎం.శంకరరావు, సిబ్బంది రమణమ్మ, శారద, వీర్రాజు తదితరులున్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి, కొత్తపల్లి, చిలకాం, నాగూరు తదితర గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు పర్యవేక్షణలో సచివాయల సిబ్బంది శనివారం తెరిచారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉండడంతో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాలను తెరిపించారు. మహిళా పోలీసులు, వలంటీర్లు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు సహకారంతో లబ్ధిదారులకు మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టారు.